


# సిగరెట్లు మానటం ఎలా?

ముక్తవరం పార్థసారథి

జెఎఫ్‌కే ఎయిర్‌పోర్టు రద్దీగా వుంది. అరైవల్స్ గేటువద్ద నిల్చుని మిత్రుని కోసం నిరీక్షిస్తున్నాడు మారిసన్. అప్పుడు, అనుకోకుండా తారసపడ్డాడు జిమ్మీ. మారిసన్ ఎయిర్‌పోర్టుకు వచ్చింది అతడికోసం కాదు. కాని, తెలిసిన మొహం గనక పలకరించక తప్పదు.

"హాయ్, జిమ్మీ!"

అతణ్ణి చూసి ఏడాది దాటింది. మనిషి కాస్త లావెక్కాడు. తాగుడెక్కువై వుట్టుంది. కళ్లకింద ముడతలు పడ్డాయి. పెదాలు నల్లబడ్డాయి. రోజుకెన్ని సిగరెట్లు కాలుస్తున్నాడో! వర్క్‌హాలిక్ (పని రాక్షసుడు) అయితే తప్ప ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోలేదు. ఈ రెండు అలవాట్లను అధిగమించిన సక్సెస్‌ఫుల్ ఎగ్జిక్యూటివ్‌ని తనింతవరకు చూడలేదు.

లాంజ్ వైపు నడిచారిద్దరూ.

''మియామీ వెళుతూ ప్లేన్లు మారటానికి యిక్కడ దిగాను'' అన్నాడు జిమ్మీ.

విస్కీ సిప్ చేస్తూ సంభాషణ కొనసాగించాడు మారిసన్.

''ఆరోగ్యం బాగానే వుందా?''

''భలేవాడివే. ఇప్పుడు నాకే అలవాట్లూ లేవు. ఆరోగ్యం నెమ్మదిగా కుదుట పడుతున్నది''.

''సిగరెట్లు గూడా మానేశావా ఏమిటి?''

''ఓ. యస్. అసాధ్యమనే అనిపించింది. మానేస్తానని ఆత్మవంచన చేసుకోవటమెందుకనిపించింది. అయినా, ఓ మిత్రుని సలహా కాదనలేక న్యూయార్క్‌లో వున్న ఓ స్పెషలిస్టుని సంప్రదించాను. అంతే ఇక ఆ రోజు నుండే సిగరెట్టు ముట్టలేదు'' అన్నాడు జిమ్మీ.

ఇలాంటి కోతల్ని నమ్మటం కష్టమే.

''ఏం చేశారేమిటి? పొగాకు బదులు మరేదైనా డ్రగ్ అలవాటు చేశారా?''

''నో. వాళ్లు చేసే ట్రీట్‌మెంటేమిటో స్వానుభవంతోనే తెలుసుకోవాలి. నీకూ స్మోకింగ్ మానాలనిపిస్తే యిదిగో. ఈ అడ్రస్‌కెళ్లు'' అంటూ ఓ విజిటింగ్ కార్డిచ్చాడు జిమ్మీ.

''నువ్వు జోక్ చెయ్యటం లేదు గదా?'' అంటూ చిరుకోపం ప్రదర్శించాడు మారిసన్.

జిమ్మీ నవ్వాడు.

''వాళ్లేం చేస్తారయ్యా? కాస్త చెప్పగూడదూ!''

''ఆ రహస్యమేదో చెప్పగూడదనేదే నువ్వు వాళ్లతో కుదుర్చుకునే కాంట్రాక్ట్‌లో మొట్టమొదటి కండిషన్''.

''నువ్వు కూడా ఆ కాంట్రాక్ట్ మీద సంతకం చేశావా?''

అవునన్నట్టుగా తలూపాడు జిమ్మీ.

''ఇదేదో మిస్టరీగా వుందే. పత్రికల్లో, టీవీలో ప్రకటనలు లేవు. హోర్డింగులు లేవు. నలుగురికీ సేవచేసే వాళ్లు అంతరహస్యంగా వుండాల్సిన అవసరమేమిటి?

''ఇది సేవ కాదు. వాళ్లు చేసే సర్వీసుకు బాగానే చార్జి చేస్తారు''

''నువ్వు వాళ్ల తరపున అడ్వర్టైజ్ చేస్తున్నావా?''

''కాదు. కాని వాళ్ల సక్సెస్ రేట్ 98%''.

''కాళ్లూ చేతులూ కట్టేసి, చిత్రహింసలు పెట్టి...''

''అలాంటి పిచ్చి పిచ్చిపనులేమీ చెయ్యరు''.

''జ్ఞానబోధ చేస్తారా?''

''కావాలంటే వెళ్లి స్వయంగా తెలుసుకోరాదూ. నన్నడగటం దేనికి?'' అంటూ సిగరెట్ వెలిగించిన మారిసన్‌వైపు చికాకుగా చూశాడు జిమ్మీ.

''నా వుద్దేశం ఏమిటంటే...''

''మారిసన్, ఒకమాట జాగ్రత్తగా విను. అక్కడికి వెళ్లటం వల్ల నా జీవితమే మారిపోయింది. నా కుటుంబ జీవితం కూడా మెరుగు పడింది. ఉద్యోగంలో ఎఫిషియెన్సీ పెరిగింది.

''ట్రీట్‌మెంట్ గురించి కాస్త క్లూ యిస్తావేమోనని...''

''సారీ, యింతకన్నా ఎక్కువ నేనేమీ చెప్పలేను.''

''ఫ్లైట్ నంబర్ 206. బోర్డింగ్ ఎట్ గేట్ నం.9'' అంటూ లౌడ్ స్పీకర్‌లో అనౌన్స్‌మెంట్ విని ''నీ యిష్టం వచ్చినన్ని సిగరెట్లు కాల్చు. అక్కడి కెళితే, ఎట్లాగూ మానేస్తావుగా..'' అంటూ హడావిడిగా బయల్దేరాడు జిమ్మీ.

***

నెల దాటింది. జిమ్మీతో జరిగిన ఎయిర్‌పోర్ట్ సంభాషణను సీరియస్‌గా తీసుకోలేదు మారిసన్. ఒకనాడు న్యూయార్క్‌లో నడుస్తున్నప్పుడు 237, ఈస్ట్ ఫార్టీయైట్ స్ట్రీట్‌లోని బోర్డు చూసి, జేబులోని విజిటింగ్ కార్డు తీసి చదివాడు. ఇక్కడే ఎక్కడో వుండాలి ఆ ట్రీట్‌మెంట్ సెంటర్.

***

అతి ఖరీదైన బిల్డింగ్‌లో అయిదో అంతస్తులో వుంది సెంటర్. వీళ్ల క్లయింట్లంతా కోటీశ్వరులే అయి వుంటారు. తన సంవత్సరం సంపాదన కూడా వాళ్ల రోజువారీ ఖర్చు లకుసరిపోదు. లాబీలో, పత్రికలు చదువుకుంటూ కూర్చున్నారు ముగ్గురు యువకులు ఒక యువతి.

''ఏం కావాలి సార్?'' అంటూ పలకరించాడో యువకుడు.

''నా పేరు రిచర్డ్ మారిసన్''.

కంప్యూటర్లో అతని పేరు రికార్డు చేసింది యువతి.

''అడ్రస్?''

చెప్పాడు.

''పెళ్లయిందా?''

''అయింది''

''పిల్లలు?''

ఒకటి అని వేలు చూపించాడు. ఒకటిన్నర అనాల్సింది. భార్య గర్భవతి.

''మా గురించి మీకెలా తెలిసింది?''

''మిస్టర్ జేమ్స్ (జిమ్మీ)...''

''కూర్చోండి''.

జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు మారిసన్. ఎక్కడా యాష్ ట్రే కనిపించలేదు. ఎంత అమర్యాద! కసిగా నాలుగు సిగరెట్లు కాల్చి బూడిద కార్పెట్ మీద రాలిస్తే సరి.

పావుగంట తర్వాత లోపల్నించి పిలుపొచ్చింది. సిగరెట్ కాల్చక చాలా సేపైందేమో, నికోటిన్ అవసరం అతడిలో అసహనాన్ని పెంచింది.

ఒక భారీకాయుడు తలుపుతెరిచి, గదిలోకి రమ్మన్నాడు. ఐసియులోలాగ, చాలా పరిశుభ్రంగా వుందది.

''నా పేరు విక్. మీరు సిగరెట్లు మానెయ్యాలనుకుంటే సాయం చేస్తాను'' అతణ్ణి చూసి మారిసన్ కాస్త బెదిరినమాట వాస్తవం.

''అందుకే గద ఇక్కడికి వచ్చింది''.

''మొదట మీరీ అగ్రిమెంటు మీద సంతకం చెయ్యాలి'' అంటూ ఓ కాగితం చూపించాడు విక్.

ఇక్కడి పద్ధతులు, టెక్నిక్‌లు మరెవరికీ చెప్పనని వాగ్దానం చేస్తున్నాను. వగైరా షరతులవి. అన్ని సెంటర్లకూ ఇలాంటి కండిషన్లు మామూలే.

సంతకం చేశాడు మారిసన్. సిగరెట్లు మానటం తనకేం కొత్తగాదు. ఇప్పటికి చాలాసార్లు మానేశాడు.

''మిస్టర్ మారిసన్, మాకు కొన్ని నియమాలున్నాయి. ఎందుకు మానెయ్య దలచుకున్నారని మిమ్మల్ని అడగం'' అంటూ ప్రారంభించాడు విక్.

''గుడ్''

''మా చికిత్సలో ఏ మందులూ వాడం. ఆహార నియమాలు పాటించమని చెప్పం. కనీసం ఒక సంవత్సరం పాటు సిగరెట్లు మానేశారని మాకు నమ్మకం కుదిరిన తర్వాతనే మీరు మాకు డబ్బులు చెల్లించవచ్చు''

''గ్రేట్'' అన్నాడు మారిసన్.

''జిమ్మీ ఈ విషయం మీకు చెప్పలేదా?''

''లేదు''

''ఇంతకూ మీ ఫ్రెండు ఎలా వున్నాడు?''

మరొకరి గురించి మాట్లాడ్డం మారిసన్‌కు నచ్చదు.

''మీ భార్య పేరు?''

''లూసిండా''

''ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నావా?''

''అఫ్‌కోర్స్''.

''మీ ఇద్దరి మధ్య ఏమైనా సమస్యలు వచ్చాయా?''

''సిగరెట్లు మానటానికీ, దానికీ ఏం సంబంధం?''

''చాలా సంబంధముంది. అందుకే గదా అడగటం''.

''సంతానం''

''మగ పిల్లవాడు. పేరు ఆల్విన్''.

''ఏ స్కూల్లో చదువుతున్నాడు''

''చెప్పను'' అన్నాడు మారిసన్ కోపంగా.

''ఓకే. ఉద్రేక పడకండి. సిగరెట్లు మానటం కష్టమే. ఈరోజు మీ ఇష్టం వచ్చినన్ని కాల్చుకోండి. రేపటినుండి మీరు కాల్చాలనుకున్నా కాల్చలేరు'' అంటూ చిరునవ్వు నవ్వాడు విక్.

***

మరుసటి రోజు మధ్యాహ్నం మూడింటికి, విక్ అపాయింట్‌మెంట్ కోసం లాబీలో కూర్చున్నాడు మారిసన్. వీళ్లవన్నీ బోగస్ వాగ్దానాలు. ట్రీట్‌మెంట్ పేరుతో డబ్బు లాగుతారు. వారం రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో చెయిన్ స్మోకింగ్ ప్రారంభించటం ఖాయం. జిమ్మీ మాటలు జ్ఞాపకం వచ్చాయి. ''నా జీవితమే మారిపోయింది!'' లిఫ్ట్‌లో పైకి వచ్చినప్పుడు కూడా సిగరెట్ కాల్చాడు. అదే చివరిదవుతుందా!

ఆ వూహే హాస్యాస్పదంగా వుంది.

తలుపు తెరుచుకుంది. గున్న ఏనుగులాంటి విక్ హార్దిక స్వాగతం పలికాడు.

''మీరివాళ వచ్చారంటేనే మీ సంకల్ప బలమెంతో తెలుస్తుంది. చాలా మంది స్మోకర్లు మానాలనుకుంటారుగాని మానలేరు. మీరు మానటం ఖాయమని గ్యారంటీ రాసిస్తాను.

''ట్రీట్‌మెంట్ ఎప్పుడు ప్రారంభమవుతుంది?''

''ఇప్పటికే ప్రారంభమైంది'' అన్నాడు విక్ నవ్వుతూ.

మారిసన్ జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు.

''మూడే సిగరెట్లున్నాయి'' అన్నాడు విక్ దిగులుగా.

''ఏం చేస్తారు?''

క్షణంలో విక్ మొహం మారిపోయింది. బాక్సింగ్ ఛాంపియన్‌లా పాకెట్ మీద పిడిగుద్దులు వర్షించాడు. సిగరెట్లు విరిగిపోయాయి. పొగాకు బయటికి వచ్చింది. పాకెట్ చిరిగింది. నిశ్శబ్దంగా వున్న ఆ గదిలో విక్ గుద్దుల చప్పుడు మృత్యుభీకరంగా వినిపించింది. విక్ మళ్లీ నవ్వాడు. కాని అది వికటాట్టహాసం. మారిసన్‌కు భయమేసింది. చెమట పట్టింది. ఇది ట్రీట్‌మెంట్‌లో ఓ ట్రిక్ కాబోలు.

''సిగరెట్ పాకెట్‌ను గుద్దుతుంటే నాకెంత హాయిగా వుంటుందను కుంటారు! మూడేళ్లుగా ఈ వృత్తిలో ఇదే పని చేస్తున్నాను. అయినా నా ఆనందం ఏ మాత్రం తగ్గలేదు''''ఇది నా చివరి సిగరెట్ పాకెట్ కాదు. బయటికి వెళ్లగానే కావలసినన్ని కొనుక్కుంటాను'' అన్నాడు మారిసన్.

''ఓ యస్. మీరేమైనా చేయగలరు. మీ అబ్బాయి ఆల్విన్ వికలాంగుడని తెలిసింది. పుట్టినప్పుడే బ్రెయిన్ డామేజ్ అయిందని చెప్పలేదేం? స్కూలు పేరు కూడా కనుక్కున్నాం. ఇక మీ ఆవిడ...''

''ఇవన్నీ మీకెవరు చెప్పారు?'' అన్నాడు మారిసన్. ఆదుర్దాను అణచుకుంటూ ''నా కుటుంబ విషయాలు తెలుసుకునే హక్కు మీకు లేదు''''డోంట్ వర్రీ. ఇంకా చాలా విషయాలు తెలుసుకున్నాం. ఈ సమాచారం మూడో మనిషికి తెలియకుండా జాగ్రత్త పడతామని హామీ యిస్తున్నాం'' అన్నాడు విక్.

''మీ ట్రీట్‌మెంట్ నాకక్కర్లేదు'' అంటూ కుర్చీ లోంచి లేచాడు మారిసన్.

''రెండు నిమిషాలు ఓపిక పట్టండి'' అన్నాడు విక్.

ప్రాధేయపడుతున్నాడు గాని నిజానికి, ఇదంతా అతనికి చెలగాటం.

ఇలా భయవిహ్వలమైన కొన్ని వందల మొహాలు అతనికి సుపరిచితమే.

''సరే, కానివ్వండి''

''దొంగ వాగ్దానాలు చెయ్యమిక్కడ. సిగరెట్లు మానటమెంతకష్టమో మాకు తెలుసు. నిజానికి అది అసాధ్యం. కాని, మేం దాన్ని మీ సహకారంతో సాధ్యం చేస్తాం. మా ట్రీట్‌మెంట్ తర్వాత కూడా 85% మంది తిరిగి స్మోక్ చెయ్యటానికి ప్రయత్నించారు. కాని మేం వున్నదెందుకు మరి?''

వేస్ట్ బాస్కెట్‌లోంచి విరిగిన ఓ సిగరెట్ తొంగి చూసింది.

"ఫరవాలేదు. దాన్ని కాల్చవచ్చు" అనుకున్నాడు మారిసన్. విక్, ఒక్క వుదుటున కిందికి వంగి, రెండు వేళ్లతో నలిపి 'పొడి' చేశాడు.

"ఇంకా ఎంత సేపిక్కడుండాలి?" అంటూ విసుక్కున్నాడు మారిసన్.

విక్, కిటికీ పరదాలు తొలగించి, "ఇలా రండి" అంటూ సైగ చేశాడు.సుమారు పదడుగుల దూరంలో, చెట్టుకింద ఒక కుందేలు ఆడుకుంటున్నది. దానికెదురుగా, ఓ పళ్లెంలో లేత కేరట్ దుంపలు కనిపిస్తున్నాయి. కుందేలు పళ్లెం వద్దకు అడుగేసిన ప్రతిసారీ షాక్ తగిలినట్టుగా ఎగురుతున్నది."స్టాపిట్. దాన్ని చంపుతావా ఏమిటి?" అంటూ అరిచాడు మారిసన్."ఆ వైర్లలో చంపగలిగినంత విద్యుత్తు ప్రసరించటం లేదు. కాని ముట్టుకుంటే షాక్ కొడుతుంది. కుందేలు కొన్నిసార్లు, కేరట్ల కోసం ప్రయత్నిస్తోంది. షాక్ భరించలేక వెనక్కు తగ్గుతుంది. చివరికి, కేరెట్లు తింటే షాక్ తగులుతుందని గ్రహించి, భోజనం మానేసి ఆకలికి మాడి చస్తుంది. ఇది మనం, ఈ సెంటర్లో అనుసరించే అవర్షన్ (విరక్తి) ట్రెయినింగ్" అన్నాడు విక్.

"ఐ హేటిట్" అంటూ తలుపు తీయబోయాడు మారిసన్.

"కాస్త ఓపిక పట్టండి సార్. అలా తొందరపడితే ఎలా" అన్నాడు విక్ ప్రశాంతంగా. తలుపు తెరుచుకోలేదు.

"లాక్ తియ్యండి".

"ప్లీజ్ బీ పేషెంట్".

"పోలీసులను పిలుస్తాను".

"కూర్చో!" అంటూ సమీపించాడు విక్. అది అధికార స్వరం.

"ఏం చెయ్యటం? వీడో సైకో లాగున్నాడు" అనుకుని తల పట్టు కున్నాడు మారిసన్.

"ట్రీట్‌మెంట్ గురించి మనం మాట్లాడాలి"

"నాకే ట్రీట్‌మెంటూ అక్కర్లేదు"

"అలా అంటే ఎలా? అగ్రిమెంటు మీద సంతకం చేశారంటే షరతులన్నింటికీ అంగీకరించినట్టే. నిన్న మొదటిసారి ఈ గదిలోకి అడుగు పెట్టినప్పుడే నేను ట్రీట్‌మెంట్ ప్రారంభమవుతుందని చెప్పాను. మీరు నమ్మలేదని నాకు తెలుసు. కాని అది నూటికి నూరుపాళ్లు నిజం"

"నువ్వేదో మెంటల్ గాడి లాగున్నావ్. నువ్వెన్ని చెప్పినా, ఏం చేసినా, నా ఇష్టానికి వ్యతిరేకంగా నాచేత సిగరెట్లు ఎలా మాన్పిస్తారు? బలవంతంగా అడ్డుకుంటే పోలీసు కంప్లెయింటిస్తాను""మిమ్మల్ని మేమెలా ఆపగలం సార్. కాని ఒక్క నిమిషం పాటు నేను చెప్పేది దయచేసి వినండి"మారిసన్ మాట్లాడలేదు.

"మొదటి నెలలో మా డిటెక్టివ్‌లు మిమ్మల్ని ఫాలో అవుతారు. అందులో కొందర్ని మీరు, గుర్తు పట్టగలరని కూడా మాకు తెలుసు. మీరు సిగరెట్ కాల్చిన క్షణమే వాళ్లు నాకు సమాచారం అందిస్తారు" అన్నాడు విక్.

"నేను కుందేలును కాను" అంటూ అరిచాడు విక్. కాని అంతలోనే మరేవేవో ఆలోచనలు అతణ్ణి భయపెట్టాయి.

"కుందేలెవరో తెలిసిందా? మీరు కాదు. మీ భార్య" అన్నాడు విక్..

***

మృత్యునీడలో నడిచాడు మారిసన్. ఏం చెయ్యటం? ఎలా ఈ ట్రాప్ లోంచి బయట పడటం. తన మూలంగా భార్య ప్రాణానికి ముప్పు వాటిల్లనుందా?

విక్ ప్రకారం అది లాభాపేక్షలేని ఒక స్వచ్ఛంద సంస్థ. అనేక వ్యాపారాలు చేసి కోట్లు గడించిన ఒక మహానుభావుడు. సిగరెట్లు కాల్చి వూపిరి తిత్తుల కాన్సర్‌తో మరణిస్తూ, ఈ సంస్థకు తన ఆస్తంతా రాసిచ్చాడు. ఎవరితోనైనా సిగరెట్లు మాన్పించటం చాలా సులభం అని విక్ ఘంటా పథంగా చెప్పాడు. మొదటి దశలో లూసిండా కుందేలుగా మారుతుంది. రెండో దశలో మారిసన్ వంతు వస్తుంది. మూడో దశలో ఇద్దరూ కలిసి జంటగా ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. అక్కడితో సిగరెట్లకు స్వస్తి పలకాలి. ట్రీట్‌మెంట్ ఇంకా వుండదా అంటే వుంటుంది. కాని, స్కూల్లోని పిల్లాణ్ణి కూడా ఇందులో చేర్చటం ఎవరికీ ఇష్టం వుండదు."కుర్రాడి పరిస్థితి తలచుకుంటే నా గుండె తరుక్కుపోతుంది. నాన్న సిగరెట్లు మానకపోవటం వల్లే తనకీ కష్టాలు వచ్చాయని వాడనుకుంటే మీకెలాగుంటుంది?" అన్నాడు విక్.

"దుర్మార్గుడా యూ డర్టీ బాస్టర్డ్" అంటూ అరిచాడు మారిసన్.

"నన్నపార్థం చేసుకోకండి. కుందేలు పరిస్థితి ఎందుకు రావాలసలు? మా క్లయింట్లలో 40 శాతం మంది మేం చెప్పినట్టుగా విన్నారు. పది శాతం మందికి మాత్రమే మూడు దశల ట్రీట్‌మెంట్ అవసరమైంది. అయితే అత్యవసర పరిస్థితుల్లో, ఐదవ దశ కూడా వుంటుందని మరచి పోకండి""అదేమిటి?""ఏముందండీ, మా వస్తాదులకు పని చెబుతాం. మేం ఒకటి చెయ్యమంటే ఒకటి చేసి వస్తారు మూర్ఖులు. మనుషులను చావబాదటం వాళ్లకు సరదా"

మారిసన్‌కు పీడకల ప్రారంభమైంది.

***

ట్రీట్‌మెంట్‌లో మొత్తం పది దశలుంటాయని తెలిసింది. తొమ్మిదో దశలో తన కొడుకు చేతులు విరిచేస్తారట.

"పది సంగతేమిటి?"

"ఇంకేం చెయ్యగలమండీ. వాళ్ల ఖర్మానికి వదిలేస్తాం. అయితే, ట్రీట్‌మెంట్ తర్వాత మా క్లయింట్లు సిగరెట్లు కాల్చరని గ్యారంటీ ఇస్తాం గనుక" అంటూ టేబుల్ సొరుగు తెరిచాడు. అందులో .45 రివాల్వర్ కనిపించింది.శుక్రవారం దంపతులిద్దరూ సినిమాకెళ్లారు. లోపలి ఆందోళనను కప్పి పుచ్చుకోవటానికి మారిసన్ ఏదో మాట్లాడుతూనే వున్నాడు. ఇంక సినిమా చూడటం ఎలా కుదురుతుంది.

"ఏమైంది నీకివాళ" అంటూ చిరాకు పడింది లూసిండా.

"నేను సిగరెట్లు మానేశాను" అన్నాడు మారిసన్.

"ఎప్పట్నించి? అరగంట నుండా?"

"మధ్యాహ్నం మూడింటి నుంచి" అప్పుడు ఎనిమిదయింది.

"అంటే అయిదు గంటలుగా సిగరెట్ కాల్చలేదు. వండర్‌ఫుల్. ఇంతకూ కారణమేమిటి?" భర్తకు కాన్సర్ వచ్చిందేమోనని ఆమె భయం.

"నీ కోసం. ఆల్విన్ కోసం" అన్నాడు మారిసన్.

ఆ రాత్రి ఆమెకు యాష్‌ట్రేలో సిగరెట్ పీకలు కనిపించలేదు.

"ఇక ఎప్పుడూ తాగవా?" అంటూ ఆశగా అడిగింది.

మానతాడని నమ్మకం లేదు. కాని అతడికా ఆలోచన వచ్చినందుకే ఆమెకు సంతోషంగా వుంది.


***

ఆ రాత్రి మారిసన్‌కు నిద్రపట్టలేదు. అర్ధరాత్రి దాటాక సిగరెట్ కాల్చాలనే కోరిక తీవ్రమైంది. హాల్లో పచారు చేశాడు. షెల్ఫ్‌లో సిగరెట్ పాకెట్ కనిపించింది. పెదాల మధ్య సిగరెట్టు పెట్టుకునే మధురానుభవం కోసం అర్రులు చాటింది మనసు.

మొదటి నెలలో డిటెక్టివ్‌లు తనను నిరంతరం వెంటాడతారని చెప్పాడు విక్. ఇప్పుడు తననెవడైనా గమనిస్తున్నారా? ఇది తనిల్లు. తలుపులు వేసి వున్నాయి. కిటికీలకు పరదాలున్నాయి. కాని, బయట సిగరెట్ పొగను పసిగట్టే పరికరమే పెట్టారేమో! తన సిగరెట్ల బలహీనతకు కొడుకు బలైపోతాడా? సిగరెట్టు రుచి ఎలా వుంటుంది? తన కొడుకు నెత్తురు లాగుంటుంది.

ఇల్లు ప్రశాంతంగా వుంది. సిగరెట్టు పొగతో ఇది తమ కుటుంబ సమాధిగా మారుతుంది.

చేతిలో సిగరెట్ పట్టుకుని చాలాసేపు ఆలోచించాడు. కోరికలు తీర్చు కోలేని బతుకుకు అర్థమేముంది? సిగరెట్ లేని ఎడారి జీవితంలో ఎన్నేళ్లు గడి



పినా, ఎన్నిమైళ్లు పయనించినా ఆనందం ఎండమావి గనే మిగలదా! వేళ్ల మధ్య సిగరెట్ లేకుండా పని చెయ్యలేడు. అలా అలవాటైంది. ఉద్యోగం ఎలా చెయ్యాలి మరి? ఆదాయం లేకపోతే భార్యా పిల్లలు రోడ్డున పడరా? తనెంత మూర్ఖుడు కాకపోతే, జిమ్మీ మాట విని విక్‌ను కలిశాడు!

తెలిసి తెలిసీ పులిబోనులో తలదూర్చనేల? తను సిగరెట్లు మానటం అసంభవం. శరీరం నికోటిన్‌కు అలవాటు పడింది. బిపి పెరిగింది. సిగరెట్ కావాలి. కావాలి. లైటర్ వెలిగించాడు.

కరెంటు తీగలమీద కుందేలు గెంతటం కళ్ల ముందు మెదిలింది. బెడ్ రూంలో భార్య కదిలిన శబ్ద మైంది. గోడలకు చెవులుంటాయి. మూసిన కిటికీలకు కూడా కళ్లుంటాయి. భారంగా నిట్టూర్చి, సిగరెట్ పారేసి, సోఫాలో వాలి కళ్లు మూసుకున్నాడు.

***

అలవాటైనవాళ్లకు, సిగరెట్ కాల్చని ఉదయం నర కమే. చిరాకు పడ్డాడు. కోపాన్ని అణుచుకోలేక తనను తనే తిట్టుకున్నాడు. ఆకలేసింది. బ్రేక్‌ఫాస్ట్ తిన్నాడు. రుచిగానే వుంది.''రాత్రి సిగరెట్ కాల్చలేదా?'' అంటూ ఆశ్చర్యంగా చూసింది లూసిండా.

''లేదు''

''మధ్యాహ్నం దాకా వుండగలవా?'' కాల్చనివా ళ్లకు కాల్చే వాళ్లంటే లోకువ. ఇలాంటి పిచ్చిపిచ్చి చాలెంజిలు విసురుతుంటారు. మారిసన్ గంభీరంగా మొహం పెట్టడంచూసి, ''నిజంగానే డిసైడ్ చేసుకు న్నట్టుందే..'' అంటూ గొణుక్కుంది లూసిండా.

***

సిగరెట్లతో మారిసన్ పోరాటం ప్రారంభమైంది. భార్యాపిల్లల క్షేమానికీ, ప్రాణాపాయానికీ మధ్య ఒక్క సిగరెట్.

బార్‌లో మందు కొట్టాడు. పగలంతా సిగరెట్ పొగతో నిండింది. మద్యానికీ, పొగాకుకూ అవినా భావ సంబంధముంది. మామూలప్పుడు నిగ్రహిం చుకున్నా, అప్పుడు మాత్రం తప్పదు. మిత్రుడు సిగ రెట్ ఆఫర్ చేశాడు. ''లేదు మానేశాను''. టేబుల్ దగ్గిర కూర్చున్న వాళ్లంతా పగలబడి నవ్వారు.

స్టేషన్‌లో లోకల్ ట్రెయిన్‌కోసం నిరీక్షిస్తున్నాడు మారిసన్. చేతిలో మార్నింగ్ పేపరున్నది. సిగరెట్ కాలిస్తే తప్ప అది చదవటంలో మజా లేదు.

కొడుకును తీసుకురావటానికి స్కూలుకెళ్లాడు. ఇంకా అరగంట టైముంది. ఏం చెయ్యాలి? అనాలోచి తంగా ఎడం చెయ్యి జేబులో పాకెట్ కోసం వెదికింది.

దగ్గు మాత్రలు, శక్కర బిళ్లలు, నోట్లో టూత్ పిక్ పెట్టుకోవటం ఇవేవీ లోపలి 'క్రేవింగ్'ను తగ్గించలేవు.

ఒకనాడు పిచ్చెక్కినట్టై, కాలుస్తున్న స్పృహయినా లేకుండానే కాల్చేశాడు.

***

అదే రోజు సాయంత్రం.

ఇంటికి చేరి తలుపు తట్టాడు.

భార్య తలుపు తీయలేదు.

ఏమైంది.

''హలో, హనీ, స్వీట్ హార్ట్''.

ఎవరూ పలకలేదు.

వణికే చేతుల్తో ట్రీట్‌మెంట్ సెంటర్‌కు ఫోన్ చేశాడు.

''గాభరా పడకండి. పెద్ద ప్రమాదమేం లేదు'' అంటూ నవ్వాడు విక్.

''యూ రాస్కెల్. మొదట ఆమెను వదిలిపెట్టు''

''సాయంత్రం అయిదింటికి కలుద్దామా?''

''ప్లీజ్... ప్లీజ్''

***

5 పి.ఎం.

గదిలో టేబుల్ వెనక పత్రిక చదువుతూ కూర్చు న్నాడు విక్.''నా భార్య ఏది? ఎక్కడ దాచావు?'' అంటూ భోరున విలపించాడు మారిసన్.''డోంట్ వర్రీ. మొదటి తప్పును సీరియస్‌గా తీసుకోం''

''నిన్ను చంపేస్తాను దుర్మార్గుడా. ఇదేదో మాఫియా వ్యవహారం లాగుంది. నిన్ను అరెస్టు చేయించకపోతే చూడు. ఇది ట్రీట్‌మెంట్ కాదు. నువ్వో క్రిమినల్‌వి....'' విక్ సానుభూతిగా నవ్వాడు.

''మీ మాటలకు కోపం తెచ్చుకుంటే నేనిక్కడ కూర్చోవటమే అనవసరం. కాస్త ఓపిక పట్టండి. పరిస్థి తిని అర్థం చేసుకోండి''పక్క గది తలుపు తెరుచు కుంది.

ఒక గ్లాస్‌డోర్ వెనకాల కనిపించింది భార్య.

''స్వీట్ హార్ట్''

''అది సౌండ్ ప్రూఫ్ ఛాంబర్. మీ మాటలు ఆమె వినలేదు''''వెనక్కి చూడొద్దు'' అంటూ మారిసన్ వీపుమీద ఎవడో రివాల్వర్ నొక్కారు.

ఏమవుతోంది? సిగరెట్ల పీడాపోయె. తను ఈ హంతకుల చేతుల్లో చిక్కుకున్నాడెందుకు? కొన వూపి రితో 'ప్లీజ్' అంటూ ప్రాణభిక్ష కోసం అర్థించాడు.

''మీ భార్యతో మాట్లాడుదురు గాని రండి'' అంటూ మారిసన్‌ను ముందుకు తోశాడు విక్.

గ్లాస్‌డోర్ పైకి లేచింది.

''హనీ''

వెక్కివెక్కి ఏడ్చింది లూసిండా.

''ఇంటికి ఎవరో ఇద్దరు వస్తాదులు వచ్చారు. నా మీద పడి చేతులూ కాళ్లూ బంధించారు. రేప్ చేస్తారని భయపడ్డాను. నేనేం నేరం చేశాను? ఎందుకు నాకీ శిక్ష''

''చేజేతులా చేసుకున్నాను. నేనే బాధ్యుణ్ణి'' అంటూ కుప్పకూలాడు మారిసన్.

పది నిమిషాలు గడిచింది.

ఆమె కాస్త తేరుకుంది.

హతాశులై యిద్దరూ ఇంటికి చేరుకున్నారు.

***

వారం తర్వాత,

విక్ గదిలో, బరువు చెక్ చేసుకున్నాడు మారిసన్.

''ఒక కిలో పెరిగారు''

''థాంక్స్''

''మేం మీ మేలుకోరే వాళ్లం. కనీసం ఏడాది దాకా నిఘా కొన సాగుతుంది. మమ్మల్ని కష్టపెట్టకండి. మిమ్మల్ని మీరు కష్టపెట్టుకోకండి.

ఏడాది తర్వాత.

''నిజం గానే నా జీవితం మారిపోయింది'' అను కున్నాడు మారిసన్. విక్ నుండి 5000 డాలర్లకు బిల్లు వచ్చింది.

***

రెండేళ్ల తర్వాత–

యాదృచ్ఛికంగా, ఒక సినిమా హాల్లో జిమ్మీ, అతని భార్యా కనిపించారు. మర్యాదగా ఆమెతో కర చాలనం చేశాడు మారిసన్. ఆమె చేయి కలిపిన తీరులో ఏదో తేడా కనిపించింది. అవును. ఆ చేతికి నాలుగు వేళ్లే వున్నాయి.

*

స్టీఫెన్ కింగ్ కథకు
సంక్షిప్తీకరణ, స్వేచ్ఛానుసరణ

రచయిత సెల్ నెం: 91776 18708

కవిత

## ఆలోచనా పాదాలవెంట....




అపరిమితంగా కదులుతున్న
ఆలోచనా పాదాల వెంట
పాకుతున్న జ్ఞాపకాలు!
అంతరంగాన్ని కదిలించే
ఎన్నో సంఘటనలు
తెరమరుగైనవి కొన్ని
తెరపై కొచ్చినవి కొన్ని
ఇప్పటికీ లోన దుఃఖపు వర్షం
రగిలే ఆనందాన్ని ఆర్పుతూ
ఆత్మఛాయల్లో సేదతీరే విశ్వాసం
మబ్బుల్లో మెరుపు తీగలా
విషాదాల్లో విజ్ఞుతై మెరుస్తూ
దేహ ఖడ్గాన్ని ఝళిపించే
నైపుణ్యాన్ని ప్రబోధిస్తూ....
ఎదురు తెన్నుల అనుభూతిలో
గుసగుసలాడే చూపుల భాష
అంతకంతకు అధిగమిస్తూ
దేహాన్ని మోసగిస్తున్న కోరికల దాహం
వలల దొంతర్ల మాటున
కన్నుగీటే ఆర్థిక వనరుల భ్రమలు
ఊరటిస్తాయని నమ్మితే
ఊపిరిని సైతం ఉడ్చేస్తూ...
లోన హఠాత్తుగా గూడుకట్టుకొన్న శూన్యం
భద్రతా భావాన్ని ముట్టడిస్తూ...
మనిషి మౌనశిల కావడమంటే
సజీవతా శిథిలం కావడమే!
చుట్టూ ముడివడ్డ నిశ్శబ్దాన్ని
బద్దలు కొట్టే ఆయుధాన్ని పోతపోస్తూన్న
మనో స్థిమితావేశ యత్నం!
కలల మధ్య ఎడారుల్ని
ఆకుపచ్చని మైదానాలు చేస్తూ
స్తంభించిన అనుభవాల్ని ముడివేస్తూ
దేహాన్ని పోరాట మయం చేస్తేనే
యాతనలు ఎండుటాకుల్లా
రాలి పోతుంటాయ్!

–కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి

సెల్: 99487 74243